ప్రజాశక్తి
సోమవారం 14 జులై 2025
5

అల్లూరి సీతారామరాజు

120 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని గాంధీనగర్ కాలనీలో క్యాథలిక్ చర్చ్, సెంటెన్స్ స్కూల్ ఆధ్వర్యంలో ఫాదర్ స్టీఫెన్ ఆధ్వర్యాన మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ స్టీఫెన్ మాట్లాడుతూ, ఈ వైద్య శిబిరానికి జిమాడుగుల పరిసర ప్రాంతాలైన మధుర మామిడి, ఉరుము, రచపల్లి, గాంధీనగర్ నుంచి సుమారు 120 మంది వైద్య శిబిరానికి హాజం య్యారన్నారు. వీరికి వైద్య పరీక్షలు నిర్వహించి, పలు వ్యాధులకు మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ మోబిన్, సిస్టర్ జూడిట్, సిస్టర్ జూలియన్, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షిస్తున్న వైద్యురాలు

అరకు బస్ స్టేషన్‌లో..

ప్రయాణికుల అవస్థలు

- నిరుపయోగంగా తాగునీటి కుళాయిలు
- విరిగిన బెంచీలు, కూర్చునేందుకు ఇబ్బంది
- పట్టించుకోని ఆర్‌టిసి అధికారులు

విరిగిన బెంచీలు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ వద్ద సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగు నీరు కుళాయి ట్యాపులు నిరుపయోగంగా మారాయి. దీంతో తాగునీటి సౌకర్యం లేక దాహాన్ని తీర్చుకునేందుకు ప్రయాణికులు ప్రైవేటు దుకాణాలను, హోటళ్లను ఆశ్రయించాల్సి వస్తోంది. కొన్ని బెంచీలు మరమ్మతులకు గురై మూలన పడ్డాయి. కనీసం ఫ్యాన్లు సదుపాయం కూడా లేదు.అరకులోయ నియోజకవర్గ, పార్లమెంట్ కేంద్రం, పర్యాటక కేంద్రం కావడంతో నిత్యం సుమారు 800 లకు పైగా ప్రయాణికులు ఇక్కడి నుంచి విశాఖపట్నం,పాడేరు, అనకాపల్లి,లోతేరు,వేంగాడ వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు.ప్లాటుఫారంలో సరిపడ బెంచీలు లేక కొందరు నిలబడాల్సిన పరిస్థితి.కాలక్షేపం కోసం టీవీ ఉన్నప్పటికీ అదికూడా మరమ్మతుకు గురైంది,దాని పట్టించుకునే పరిస్థితి లేదు.ఆర్టీసీ ప్రయాణికులు వంద సంఖ్యలో ప్రయాణం కోసం బస్ కాంప్లెక్స్ ను ఆశ్రయిస్తున్నారు.కనీసం తాగునీరు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఆర్టీసీ అధికారులు స్పందించి తాగునీరు సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



అరకు బస్‌స్టేషన్

నిరుపయోగంగా ఉన్న కుళాయిలు

పశువులను రోడ్లపై విడిచి పెట్టొద్దు

ప్రజాశక్తి-చింతపల్లి:పశువుల యజమానులు నిర్లక్ష్యంగా ఆవులను జాతీయ రహదారులపై వదిలేయడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని తెదేపా అరకు పార్లమెంటు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం తెలిపారు. పశువులను వదిలేయకుండా సంరక్షించుకోవాలని పశుసంవర్ధక శాఖ ఇప్పటికే పలు మార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ యజమానులు అలాంటి చర్యలు తీసుకో లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్లు వాహనాల నుండి దిగి ఆవులను తరిమి వాహనాలు నడపాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పశువుల యజమానులు తమ బాధ్యతను గుర్తించుకుని ఆవులను సంరక్షించుకోకపోతే అధికారులు పశువులను దేవస్థానాల గోశాలలకు తరలించే విధంగా కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని నాగభూషణం హెచ్చరించారు. ప్రయాణికుల ప్రాణాలను రక్షించేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ తప్పనిసరి

- 'ప్రజాశక్తి'తో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వి.జయరాజు

ప్రజాశక్తి-పాడేరు: పెంపుడు జంతువుల పట్ల ప్రజల్లో మరింత అవగాహన పెరగాలని, తమ పెంపుడు జంతువులకు యాంటీ రాబిస్ వ్యాక్సినేషన్ క్రమబద్ధంగా చేయించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వి. జయరాజు సూచించారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై ఆయన మాటల్లోనే...

పెంపుడు జంతువులతో వచ్చే వ్యాధులు?

పెంపుడు జంతువుల వల్ల మనుషులకు పలు వ్యాధులు సంక్రమిస్తాయి. వీటిలో ముఖ్యంగా ర్యాబిస్, ఆంత్రాక్స్, బుసెల్లోసిస్, లేప్రోస్పైరోసిస్ వంటి వ్యాధులు సోకే అవకాశం ఉంది. కచ్చితంగా పెంపుడు జంతువుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

రేబిస్ వ్యాక్సిన్ ఎక్కడ వేయించాలి

పెంపుడు శునకాలకు రేబిస్ రాకుండా ఏఆర్ వ్యాక్సిన్ వేయించాలి. నిరంతర ప్రక్రియగా పెంపుడు శునకాలకు ప్రభుత్వ ప్రాంతీయ పశువైద్యశాలలు వెటర్నరీ డిస్పెన్సరీలలో ఏంటిరాబిస్ వ్యాక్సిన్ వేస్తున్నాం. ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా జిల్లాకు 3600 రాబిస్ వ్యాక్సిన్ డోసులను ప్రభుత్వం సరఫరా చేసింది. ప్రభుత్వ పశు వైద్య శాలల్లో నిరంతరం ఈ వ్యాక్సిన్ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నాం.

ఇతర పెంపుడు జంతువులపై జాగ్రత్తలు

ఇతర పెంపుడు జంతువుల విషయంలోనూ జాగ్రత్తలు పాటించాలి. మాంసాహారం వినియోగించే గొర్రెలు మేకలు, కోళ్ల తదితర వాటికి వ్యాక్సినేషన్ చేయించుకోవాలి. వీటికి వ్యాధులు ప్రబలకుండా నివారించుకోవాలి. పాల ఉత్పత్తుల వినియోగంపై సక్రమ పద్ధతిని అనుసరించాలి. మరిగించిన పాలు వాడటం శ్రేయస్కరం. తరచూ పాలు మరిగించకుండా సేవిస్తే టీబి వ్యాధి సోకుతుంది.

పశు వ్యాధుల నివారణకు చర్యలు? ..

ఈ సీజన్లో పాడి పశువులకు సంక్రమించే వ్యాధుల నివారణ కోసం వ్యాక్సినేషన్ కు చర్యలు చేపడుతున్నాం. ఆవులు, గేదెల్లో సంభవించే గొంతువాపు, మక్క వాపు వ్యాధి నిరోధక టీకాలు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు అందిస్తున్నాం. ఏడాదికి రెండుసార్లు చొప్పున నాలుగు లక్షల అరవై వేల డోసులు వినియోగిస్తున్నాం. గొర్రెల్లో పిపిఆర్ బ్లూటంగ్ మరియు చీడపారుడు వ్యాధుల నివారణకు వ్యాక్సిన్ వేస్తున్నాం. కోళ్లల్లో కొక్కు వ్యాధి నివారణకు ఆర్ డి వ్యాక్సినేషన్ చేస్తున్నాం....

వాక్సినేషన్ ప్రక్రియ

జిల్లాలో పెంపుడు జంతువులకు, కోళ్లకు, వార్షిక హెల్త్ క్యాలెండరు ప్రకారం ఆయా సీజన్లలో ఆయా వాతావరణ పరిస్థితుల్లో సంక్రమించే వ్యాధుల నివారణ కు వాక్సినేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జిల్లాలో ఆవులు/ గేదెలు 5లక్షల 66 వేలు, గొర్రెలు/ మేకలు5 లక్షల 89 వేలు, కోళ్లు 1 లక్ష,20 ఉన్నాయి.

పశుగ్రాస విత్తనాల పంపిణీకి ప్రతిపాదన

అల్లూరి జిల్లా ఏజెన్సీలో గిరిజన పాడి రైతులకు ఏక వార్షిక పశుగ్రాస విత్తనాల పంపిణీకి ప్రతిపాదన చేశాం. ప్రభుత్వం నుంచి మంజూరు కాగానే రైతు సేవా కేంద్రాల ద్వారా వీటిని పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా ఈ నెల అన్ని మండలాల్లో బహువార్షిక పశుగ్రాసాల పెంపకం వినియోగంపై గిరిజన రైతులకు అవగాహన కల్పించాం. నీటి సౌలభ్యం ఉండే చోట ఐదేళ్లపాటు ఈ బహువార్షిక పశుగ్రాసాల పెంపకం పై ప్రయోజ నాలను రైతులకు వివరించాం.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి- అనంతగిరి:చిలకలగెడ్డ బాలుర ఆశ్రమో ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్‌గా పని చేస్తున్న బిడ్డ. ఎరుకులు గుండెపోటుతో మృతి చెందారు. స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు, చిలకలగెడ్డ పాఠశాల హెచ్ఎం సైమన్, హెచ్ఎంలు, ఉపాధ్యాయ సిబ్బంది స్వగ్రామమైన గుమ్మ లో ఆదివారం ఎరుకలు భౌతిక కాయానికి నివాళులు అర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఉపాధ్యాయునిగా ఎంతో అంకిత భావంతో పని చేశారని తోటి ఉపాధ్యాయులు తెలిపారు. కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు, నివాళులు అర్పించిన వారిలో ఉపాధ్యాయులు దేవుడు, శెట్టి. రాంబాబు, గురుదొర, దొంబు, శేఖర్, పరశురాం, రామ సుందర్ తదితరులు ఉన్నారు.

నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, బంధువులు

తగ్గిన గోదావరి

ప్రజాశక్తి - చింతూరు / ఎటపాక :భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం శనివారం రాత్రి 41 అడుగులకు పెరిగింది. దీంతో చింతూరు శబరి నది నీటిమట్టం పెరిగి ఎగపోటు రావటంతో సోకులేరు వాగు ప్రమాద స్థాయిలో పొంగి ప్రవహించింది. ఆదివారం తెల్లవారుజామున భద్రాచలం వద్ద గోదారి నీటిమట్టం 6 అడుగులకు తగ్గి 35 అడుగుల వద్ద నిలకడగా ఉంది. దీంతో చింతూరులో ముంపునకు గురైన రహదారి బయటపడింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు అధికంగా కురవడంతో తాళిపేరు, పేరూరు, దుమ్ముగూడెం రిజర్వాయర్లలో నిల్వఉన్న నీరు దిగువకు వచ్చి చేరడంతో గోదావరి గణనీయంగా పెరిగి మళ్లీ తగ్గటం జరిగింది. ఆదివారం సాయంత్రానికి కాస్త తగ్గుముఖం బట్టి 33 అడుగులకు చేరుకుంది. దీంతో ముంపు గ్రామాల వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

మన్యంలో భారీ వర్షం

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో వారపు సంతకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉదయం 9 గంటలకు విద్యుత్ ఉద్యోగులు కార్మికులు కూలీలు నిత్యవసర సరుకులు కొనుగోలు చేయడానికి ఇబ్బందులు గురయ్యారు. గంట తర్వాత వర్షం ఆగడంతో వ్యాపారులు దుకాణాలు తెరిచి విక్రయాలు జరిపారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటల వరకు వర్షం కురవకపోవడంతో కిరాణా, కాయగూరల వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత మళ్లీ భారీ వర్షం కురవడంతో చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. దూర ప్రాంతాల నుంచి సంతకి వచ్చిన గిరిజనులు నానా అవస్థలకు గురయ్యారు.

సీలేరులో కురుస్తున్న వర్షం

ఎడతెరిపి లేని వర్షంతో అవస్థలు

పెదబయలు : మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం ఎండ కాయగా మధ్యాహ్నం రెండు గంటల నుండి ఎడతెరపి లేకుండా వర్షం కురవడంలో మండల కేంద్రంలో వాహనదారులు అవస్థలు పడ్డారు. వర్షంతో మండల కేంద్రానికి వచ్చిన ప్రజలు దుఖాణాల వద్ద స్తంభించి పోయారు. వర్షపు నీరు మెయిన్ రోడ్డుపై చెత్తా చెదారంతో కలిసి అస్తవ్యస్తంగా మారింది.

కొమరం భీమ్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-కూనవరం : స్థానిక కోతులగుట్ట, స్వాతంత్ర సమర యోధుడు కొమరంభీం విగ్రహం వద్ద ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ ఉపాధ్యాయులు హాజరై కొమరం భీమ్ విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సరియం అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల తొమ్మిదో తేదీన అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విగ్రహాన్ని ధ్వంసం చేశారని వారిని తక్షణమే గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఈ రకంగా విగ్రహాలను ధ్వంసం చేయడం అనేది ఆదివాసి మనోభావాలను దెబ్బతీయడమేనని తెలిపారు. ఇటువంటి చర్యలను ఆదివాసి సమాజం చూస్తూ ఊరుకోబోదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు కట్టం వీరయ్య, ఎటిఎ ఐటిడిఎ ఇన్‌చార్జి సొందె వెంకటరావు, ఉర్మ బాలాజీ, కుంజా జితేంద్ర, పాయం ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోతులగుట్టలో కొమరంభీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అనిల్‌కుమార్

వైద్యులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

ప్రజాశక్తి - అడ్డతీగల: రంపచోడవరం ఏరియా హాస్పిటల్‌కు రంపచోడవరం నియోజవర్గంలో ఉన్న పిహెచ్‌సిల నుంచి గర్భిణులకు ఇబ్బంది కలిగితే రంపచోడవరం ఏరియా హాస్పిటల్‌కు రిఫర్ చేస్తారు. అటువంటిది రంపచోడవరం ఏరియా హాస్పిటల్‌లోనే ప్రసవం ఇబ్బంది అని రాజమండ్రి రిఫర్ చేసినప్పుడు మార్గమధ్యలో ఏరియా హాస్పిటల్‌కి ఐదు కిలోమీటర్ల దూరంలోనే సులభంగా 108లో ప్రసవం జరగడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శమని సిపిఎం రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ అధికారులు పనిచేస్తున్నారా లేక నిద్రావస్థలో ఉన్నారా ఐటిడిఎ అధికారుల పర్యవేక్షణ లోపమా అని విమర్శించారు.

మహిళా నాయకురాలు మట్లవాణి స్పందిస్తూ ఈ విషయంపై ఐటిడిఎ అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి గిరిజన మహిళలకు న్యాయం చేయాలని ఆమె తెలిపారు. ఇటువంటి పరిణామాలు మరోసారి పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆమె హెచ్చరించారు.

వేతన బకాయి చెల్లించాలని

సత్యసాయి కార్మికుల బైక్ ర్యాలీ

దేవీపట్నం-ప్రజాశక్తి: సత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న సత్యసాయి కార్మికులు గత 6 రోజులుగా సమ్మె చేస్తున్నారు. వీరికి 19 నెలల నుంచి వేతనాలు లేకపోవడంతో ఈఎస్ఐ, పిఎఫ్ కట్టడం లేదని సంబంధిత అధికారులకు కలెక్టర్‌కి ఎన్నిసార్లు విన్నవించినా సమస్యను ఎవరూ పట్టించుకో వడం లేదు. గోకవరం నుండి ఇందుకూరుపేట ఇందుకూరుపేట నుండి బొలేద్దుపాలెం వరకూ కార్మికులందరూ బైక్‌ర్యాలీగా వెళ్లి ఆయా గ్రామాల్లో గ్రామపెద్దలను సర్పంచ్‌లను కలిసి మద్దతు తెలపాలని కోరారు. దేవీపట్నం మండలం పోలవరం నిర్వాసితుల కాలనీ అయిన పెద్దభీంపల్లి పునరావాస కాలనీ వన్‌లో నిర్వాసితులు వీరికి సంఘీభావం తెలుపుతూ మేము ఇక్కడికి వచ్చినప్పటినుండి సత్యసాయి వాటర్ బాగా అలవాటుపడ్డాం ఇప్పుడు కార్మికులు సమ్మెబాట పట్టడంతో తాగునీరు లేక అవస్థలు పడుతున్నామని ప్రభుత్వం స్పందించి కార్మికులకు వేతనాలు ఇప్పించి మాకు తక్షణమే తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి సిబ్బంది పాలాడి శ్రీనివాసు, కట్టుమూరి వీరబాబు రామకృష్ణ పి.శేషారావు తాతాజీ సత్యసాయి సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ నిర్వహించిన సత్యసాయి కార్మికులు

'మీ కోసం' సేవలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి mekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. సోమవారం విశాఖపట్నం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తామని, కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాల న్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని, సమస్య పరిష్కారమైతే ఫోన్‌కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్‌ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు,ఎండార్స్మెంట్‌ను వాట్సఅప్‌లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్‌గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అసంపూర్తిగా ప్రభుత్వ కార్యాలయ భవనాలు

- పట్టించుకోని అధికారులు

నిర్మాణ దశలో నిలిచిన భవనాలు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని గిరిజనులు, ప్రభుత్వ ఉద్యోగుల సౌకర్యార్థం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ భవనాలు ప్రస్తుతం పూర్తికాక అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఈ భవనాల నిర్మాణం కోసం గతంలో ప్రభుత్వం లక్షలాది రూపాయలు నిధులు మంజూరు చేసింది. అయితే పూర్తిస్థాయిలో నిర్మించకుండా వదిలేయడంతో అవి అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో గిరిజనులకు, ఆ శాఖల్లో విధులు చేపడుతున్న ఉద్యోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. నూతనంగా భవన నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ నిర్మాణాలు చేపట్టి సుమారు ఐదేళ్లు గడుస్తున్నా ఇప్పటికి పూర్తి స్థాయిలో నిర్మాణం జరగలేదు. భవనాలు నిర్మించి ప్లాస్టింగ్ చేయకుండా వదిలేయడంతో అవి శిధిలావస్థకు మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయం, రైతు భరోసా కేంద్రానికి చేరుకుంటున్నాయి. దీంతో, లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి నిర్మిస్తున్న ప్రభుత్వాలు ఎందుకు పనికి రాకుండా పోతున్నాయని స్థానిక గిరిజనులు అంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవనాలను పూర్తిచేసి వినియోగంలో తీసుకురావాలని మండలంలోని గిరిజనులు కోరుతున్నారు.

పునాది దశలోనే.. నిలిచిన తహశీల్దార్ కార్యాలయం

ప్రజాశక్తి- చింతపల్లి:చింతపల్లి తహశీల్దార్ కార్యాలయం నిర్మాణం పునాది దశలోనే నిలిచిపోయింది. 2018లో అప్పటి శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి సుమారు 90 లక్షల రూపాయల వ్యయంతో ఈ కార్యాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిర్మాణ బాధ్యతలు తీసుకున్న గుత్తేదారుడు పునాది వరకు పనులు చేపట్టాడు. ఆపై మూడేళ్ల పాటు పనులు కొనసాగించ లేదు. అంతలోనే కరోనా మహమ్మారి ఉద్ధతంగా వ్యాపించగా, గుత్తేదారుడు ఆ వ్యాధి బారిన పడి మృతి చెందాడు. ఫలితంగా పనులు అక్కడే ఆగిపోయాయి. దీంతో, నూతన తహశీల్దార్ కార్యాలయం ఇప్పటికీ పునాదుల దశలోనే నిలిచి ఉంది.



పునాది దశలో ఉన్న తహశీల్దార్ కార్యాలయం

ప్రస్తుతం ఉన్న తహశీల్దార్ కార్యాలయం వర్షాకాలంలో జలమయం కావడం, రికార్డులు రక్షించుకోవడంలో అవస్థలు ఎదురవడంతో రెవెన్యూ సిబ్బంది అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే స్పందించి భవనం పనులు పూర్తి చేయాలని స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

చాపరాయి వద్ద అధిక సంఖ్యలో పర్యాటకులు

చాపరాయిలో పర్యాటకుల తాకిడి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండలంలోని పర్యాటక కేంద్రమైన చాపరాయికి ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దీంతో చాపరాయి జలపాతం ప్రాంతం పర్యాటకులతో కిటకిటలాడింది. సందర్శించిన పర్యాటకులు జలపాతం అందాలను తిలకించి ఆస్వాదిస్తూ ఆనందంగా గడిపారు. కుటుంబ సమేతంగా జలపాతం గార్డెన్ వద్ద ఫోటోలు తీయించుకుంటూ సందడి చేశారు. పర్యాటకుల సందర్శనతో పర్యాటక ప్రాంతాలు సందడిగా కనిపిస్తున్నాయి.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి -మధురవాడ : శిల్పారామం జాతరలో నిర్వహించే వారంతపు సాంస్కృతిక కార్యక్రామాల్లో భాగంగా ఆదివారం చేపట్టిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. శ్రీ సిద్యంధ్ర యోగి నాట్యాలయం చిన్నారులచే కోలాటం, జానపద నృత్యాలు ప్రదర్శించారు. ముందుగా బుజ్జి బుజ్జి గణపయ్య, భావములోన, జాతిశ్వరం, ముకుంద ముకుంద, ప్రాణావాలయం, అరుకు థింసా తదితర నృత్యాలకు ఆకాంక్ష, మౌనిక, ప్రజ్ఞ, చిన్నారి, రాజి, సంజన, మనవిత, నవ్య నత్య ప్రదర్శన ఇచ్చారు. మోహన్ లక్ష్మి నృత్య దర్శకత్వం వహించారు. పరిపాలనాధికారి రమేష్ రెడ్డి పర్యవేక్షించారు.

కొండవాగు కాదిది.. తారు రోడ్డే!

- అధ్వానంగా ఎర్రవరం, ఎర్నాపల్లి రోడ్డు
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నిలిచిన పనులు
- వాహనదారులు, ప్రజల అవస్థలు

ప్రజాశక్తి-.చింతపల్లి: మండలంలోని ఎర్రవరం-ఎర్నాపల్లి రోడ్డు అధ్వానంగా తయారైంది. వర్షాలు కురుస్తున్న కొద్దీ రోడ్డు వరద నీటి ప్రవాహంతో కొండవాగుగా మారిపోయిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల చింతపల్లి ప్రాంతానికి చెందిన గుత్తేదారు ఈ రోడ్డు నిర్మాణానికి గ్రావెల్ వేసి పనులు మధ్యలోనే వదిలేశాడని ఎర్రవరం, ఎర్నాపల్లి గ్రామస్థులు గూడెపు వీర్రాజు, చెదల కంఠం పడాల్, రాజబాబు, బాలరాజు, జనసైనికుడు గూడెపు వేణుగోపాలరాజు తెలిపారు.

గొందిపాకల పంచాయతీ పరిధిలోని సమగిరి నుంచి ఎర్రవరం, ఎర్నాపల్లి, తప్పలమామిడి, వంట్లమామిడి వరకు రోడ్లు బురదమయమై వర్షాలు పడినప్పుడు వరద నీరు పోయే వాగులా మారిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు పూర్తిగా నిర్మాణం పూర్తి చేస్తే చింతపల్లి మండలంతో పాటు కొయ్యూరు మండలానికి వెళ్లే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని నిలిచిపోయిన రోడ్డు పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని మన్యవాసులు కోరుతున్నారు.

కొండ వాగును తలపిస్తున్న ఎర్రవరం, ఎర్నాపల్లి వెళ్లే రోడే..!

నేరాలు ఘోరాలు

పలుచోట్ల రోడ్డు ప్రమాదాలు

ప్రజాశక్తి -జి.మాడుగుల :మండలంలోని రచ్చపల్లి గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. జి.మాడుగుల వస్తున్న ఆటో, జిమాడుగుల నుండి చింతపల్లి వెళ్తున్న ట్రాలీ వ్యాను రచ్చపల్లి గ్రామ మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. బాధితులను జి.మాడుగుల ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం పాడేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

చింతపల్లిలో గాయాలపాలైన బాధితుడు

చింతపల్లి:మండలంలోని చెరుకుంపాకలు- బంధబయలు మధ్య లింగాల గుడి సమీపంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. దీంతో, ఏపీఎస్పీ హెడ్ కానిస్టేబుల్ తులాసికి గాయాలు అయ్యాయి. అలాగే ఈ ప్రమాదంలో గండేపల్లి ప్రసాద్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. హెడ్ కానిస్టేబుల్ తులాసి చింతపల్లి నుండి అన్నవరం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, అన్నవరం నుండి నర్సీపట్నం ప్రసాద్ వస్తుండగా వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. స్థానికులు బాధితులను చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యానికి నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

బొలెరో ఢీకొట్టి బైకిస్ట్‌కు తీవ్రగాయాలు

ప్రజాశక్తి-వడ్డాది : ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని బొలెరో ఢీకొట్టిన ఘటనలో బైకిస్ట్‌కు తీవ్రగాయాలైన ఘటన ఆదివారం బుచ్చయ్యపేట మండలం వడ్డాది హైస్కూల్ వద్ద చోటుచేసుకుంది. వివరాలివి. వడ్డాది నుంచి కొండెంపూడి వెళుతున్న బొలెరో వాహనం హైస్కూల్ వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి పక్కనున్న షాపులోకి దూసుకుపోయింది. ఈప్రమాదంలో షాప్ వద్ద ఆగి ఉన్న బైక్‌పై కూర్చున్న సిహెచ్ లక్ష్మీనారాయణ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి క్షతగాత్రుడుని అనకాపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆదివారం సెలవు రోజు, మధ్యాహ్నం సమయం కావడంతో హైస్కూల్ జంక్షన్‌లో పెద్దగా జనసంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఎంపిడిఒకు పుష్పగుచ్ఛాన్ని ఇస్తున్న నాయకులు

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-చింతపల్లి:మండలంలోని 17 పంచాయతీల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు కోరారు. ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా చింతపల్లి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన సీతామహాలక్ష్మిని జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు కిముడు కృష్ణమూర్తి (పండు)తో కలిసి పుష్పగుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారి, మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు కూడ రామకృష్ణ, మర్రి మనోహర్, మఠం శ్రీనివాస్, వంతల రాజన్, చంటి, రమేష్, సతీష్, జగపతి తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న భీమ్‌సేన నాయకులు

ఎస్‌సి, ఎస్‌టిలపై పాలకుల వివక్ష

- భీమ్ సేన వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు రవి సిద్ధార్థ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వంలో ఎవరు ఉన్నప్పటికీ, పాలకులు ఎవరైనప్పటికీ ఎస్సి,ఎస్టిల పట్ల వివక్ష కొనసాగుతోందని భీమసేన వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.రవిసిద్ధార్థ అన్నారు. ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద భీమసేన వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సి, ఎస్టి బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ఎస్సి,ఎస్టీ యువతకు ప్రత్యేక రుణమేళా నిర్వహించాలని, ప్రభుత్వ బ్యాంకుల ద్వారా రుణాలు కల్పించాలన్నారు. ఎస్సి , ఎస్టీ హాస్టల్స్‌లో మౌలికవసతులు కల్పించాలన్నారు. ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసులపై సత్వర న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ డిగ్రీ కాలేజీలు జిల్లాకు నాలుగు చొప్పున మంజూరు చేయాలన్నారు. డిమాండ్లు నెరవేరని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అసోసియేషన్ కార్యదర్శి బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఐఐఎంవి శిక్షణకు హాజరైన ప్రతినిధులు

ఎగ్జిక్యూటివ్ పిహెచ్‌డి శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం (ఐఐఎంవి) తన ఎగ్జిక్యూటివ్ పిహెచ్‌డి ప్రోగ్రామ్ రెండోబ్యాచ్‌ను ఆదివారం ప్రారంభించింది. ఈ ప్రోగ్రామ్‌లో అంతర్జాతీయ భాగంతో సహా బహుళ క్యాంపస్ ఇమ్మర్షన్‌లు ఉన్నాయి. ఈ కొత్తబ్యాచ్‌లో ఆటోమొబైల్, ఏవియేషన్, బ్రాడ్‌కాస్టింగ్, కన్సల్టింగ్, విద్య, ఇన్ఫర్మేషన్‌టెక్నాలజీ టెలికమ్యూని కేషన్స్ వంటి విభిన్న రంగాల నుండి 17 మంది సభ్యులు ఉన్నారు. ఆదివారం ఐఐఎంవిలో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఐఎం రాంచీ డైరెక్టర్ ప్రొఫెసర్ దీపక్‌కుమార్ శ్రీవాస్తవ్ పాల్గొని కొత్తబ్యాచ్‌ను ప్రారంభించారు. అనంతరం ఐఐఎంవి డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ మాట్లడుతూ పరిశోధనలు ఆలోచనలో స్పష్టతను తెస్తుందని, ఇది కమ్యూనికేషన్‌ను పెంచుతుందన్నారు. కార్యక్రమంలో ఐఐఎంవి ఛైర్‌పర్సన్ (అడ్మిషన్స్) ప్రొఫెసర్ ప్రశాంత్ ప్రేమ్‌కుమార్‌నాయర్, ఐఐఎంవి పిహెచ్‌డి ప్రోగ్రామ్స్ ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ అమిత్‌శంకర్, మార్కెటింగ్, డీన్ (విద్యాశాస్త్రం) ప్రొఫెసర్ విజయభాస్కర్ మారిసెట్టి, డీన్ (అడ్మినిస్ట్రేషన్) ప్రొఫెసర్ కావేరి కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

17న బెంట్లీ ఇన్నోవేషన్ డే

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈనెల 17న హైదరాబాద్‌లో ఇన్నోవేషన్ డేను ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ బెంట్లీ సిస్టమ్స్ నిర్వహించనుందని సంస్థ ప్రతినిధి యిన్నివిహా తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. భారతదేశం మౌలిక సదుపాయాల రంగాలలో అర్థవంతమైన పురోగతిని నడిపిస్తున్న డిజిటల్ ట్విన్స్, జియోటెక్నికల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాఫ్ట్‌వేర్ పరిష్కారాలను అన్వేషించడానికి ప్రభుత్వం, పరిశ్రమ, సాంకేతిక నాయకులను ఒకచోట చేర్చడం కోసం ఇన్నోవేషన్ డే దోహదపడుతుందని తెలిపారు.

ప్రకృతి అందాలకు ఫిదా..

ఉరుకులు పరుగులు జీవితం, ఎన్నో ఒత్తిడులు, కాలుష్యం, వాహనాల రొదలు, ఇలా సమస్యలతో సతమతమవుతున్న వారికి చక్కని ఆటవిడుపు సీలేరు అందాలు..కొండలను చీల్చుకుంటూ వెళ్తున్న రహదారి, రహదారికి ఇరువైపులా పచ్చని చెట్లు, మిరియాలు, యాలకుల తోటలు, జాలువారే జలపాతాలు, పక్షుల కిలకిలారావాలు ఇలా సీలేరులో ప్రకృతి అందాలు వర్ణించడానికి అలవికానిచందంగా ఉంటాయి. ఇప్పుడిప్పుడు రెండు తెలుగురాష్ట్రాల నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి కూడా పర్యాటక ప్రేమికులు ఈ ప్రాంతాన్ని చూడడానికి తరలివస్తున్నారు.

ఐస్‌గెడ్డ జలపాతం

దారాలమ్మ ఆలయ సమీపంలో జలపాతం

ప్రజాశక్తి - సీలేరు: జికె వీధి మండలం సీలేరు చెంతనే ఉన్న ఐసిగెడ్డ అందాలకు పలువురు ఫిదా అవుతున్నారు. ఎత్తైన కొండలపై నుంచి జాలువారే జలపాతాలు, పక్షుల కిలకిలారావాలతో ఈ ప్రాంతం చూపరులను ఆకట్టుకుంటోంది. సీలేరు సమీపంలో ప్రధాన రహదారి పక్కనే జలపాతాలు ఉండడంతో దారి పొడవునా ప్రయాణం చేసే ప్రయాణికులు జలపాతాలను చూస్తూ పరవశించిపోతున్నారు. సీలేరు పరిసర ప్రాంతాల్లో పచ్చటిదట్టమైన అడవులు ఎంతగానో అకట్టుకుంటున్నాయి. ఆంధ్ర ఒరిస్సా తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఈ ప్రాంతానికి పర్యాటకులు తరలివస్తుంటారు. సీలేరు ఐసుగెడ్డ అందాలను తిలకించి ఆస్వాదిస్తుంటారు. సీలేరు ఘాట్ రోడ్‌లో నారాలమ్మ అమ్మవారి సమీపంలో ఎత్తైన కొండల నడుమ జలపాతాలు మరింత ఆకట్టుకుంటున్నాయి. దారకొండ ఘాట్‌రోడ్ నుంచి జికె వీధి చింతపల్లి ప్రధాన రహదారి సమీపంలో కాఫీతోటలు మిరియాలు, యాలకుల పాదులు మరో ఆకర్షణ. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దితే ఎంతో అభివృద్ధి చెందుతుందని ఈ ప్రాంత ప్రజలు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ట్రైబల్ సెల్‌తో మెరుగైన వైద్యసేవలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లోని ట్రైబల్‌సెల్‌లో మెరుగైన వైద్య సేవలు గిరిజనులకు అందుతున్నాయని, అల్లూరి సీతారామరాజు జిల్లా విశాఖఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.విశ్వేశ్వరనాయుడు, కేజిహెచ్ ట్రైబల్‌సెల్ వైద్యాధికారి డాక్టర్ సంపత్ తెలిపారు. ఆదివారం కెజిహెచ్‌లోని ట్రైబల్‌సెల్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ విశ్వేశ్వరనాయుడు మీడియాతో మాట్లాడుతూ విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాల పరిధి రిఫరల్ సేవల ద్వారా గిరిజన రోగులకు మెరుగైన వైద్యసహాయం అందించే దిశగా కెజిహెచ్‌లో చేర్పించి ప్రత్యేక వైద్యుల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు,చికిత్సలు, ఆపరేషన్లు జరుపుతున్నామన్నారు. గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఐటిడిఎ పాడేరు పూర్వ ప్రాజెక్టు అధికారి నాగులపల్లి శ్రీకాంత్ ప్రత్యేక చొరవతో అప్పటి పాడేరు డివిజన్ పరిధి వైద్యాధికారులు డాక్టర్ టి. విశ్వేశ్వర నాయుడు, డాక్టర్ ఎఎస్ఎల్‌వి శాస్త్రి, డాక్టర్. సి.ఎం ప్రసాద్ ద్వార ప్రణాళికను సిద్ధం చేసి అప్పటి విశాఖపట్నం జిల్లా కలెక్టర్,కెజిహెచ్ సూపరింటెం డెంట్ సహకారంతో 2005జులైలో విశాఖపట్నం కెజిహెచ్ ఆవరణలో ట్రైబల్ సెల్ ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కెజిహెచ్ సూపరింటెండెంట్, ట్రైబల్‌సెల్ వైద్యాధికారితో బ్యాంకు జాయింట్ ఎకౌంట్ తీసుకొని తక్షణమే రూ.5 లక్షల నగదును అకౌంట్‌లో జమ చేయడం జరిగిందన్నారు . కెజిహెచ్‌లో వైద్య సేవలు పొందుతూ మరణించిన రోగులకు వారి స్వగ్రామానికి మృతదేహాలను తక్షణమే చేర్చేందుకు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో 3 అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారని, ఇద్దరు డ్రైవర్లు విధుల్లో ఉంటారని తెలిపారు. మరొకరిని భర్తీ చేయాల్సి ఉందన్నారు. వైద్యాధికారులు,సిబ్బంది అన్నీ వేళల అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం గిరిజన రిఫరల్ రోగుల వివరాలను రికార్డుల్లో నమోదుచేయడం జరుగుతున్నందున అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి ఆధ్వర్యంలో ట్రైబల్‌సెల్‌ను ఆధునీకరణ జరుపుతూ రోగుల వివరాలు నమోదు కొరకు కంప్యూటర్, ఫర్నిచర్ మున్నగునవి సిబ్బందికి అందించనున్నట్లు తెలిపారు. కెజిహెచ్ ట్రైబల్‌సెల్‌కు వచ్చే గిరిజన రోగులు వైద్య సలహాల కోసం 6303921375 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

రికార్డులను పరిశీలిస్తున్న విశ్వేశ్వరనాయుడు

శాంసంగ్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా అత్యాధునిక సాంకేతిక శిక్షణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: సాంసంగ్ సెమీ కండక్టర్ ఇండియా రీసెర్చ్ (ఎస్ఎస్ఐఆర్) తమ తొలి సాంసంగ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను కర్ణాటకలోని కోలార్ గోల్డ్‌ఫీల్డ్ (కేజిఎఫ్) ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభించిందని సంస్థ డైరెక్టర్ బాలాజీ తెలిపారు. ఈ డెవలప్‌మెంట్ సెంటర్ కు సంబంధించి దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న రోడ్ షోల్లో భాగంగా ఆదివారం ఉదయం విశాఖ నగరంలోని వెల్కమ్ గ్రాండ్ బే హోటల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ శాంసంగ్ సంస్థ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తోందని తమ ఇనిస్టిట్యూట్‌లో ఇంజనీరింగ్‌తో పాటు ఏఐ/ ఎంఎల్, సైబర్ సెక్యూరిటీ, ఆటోమేషన్, రోబోటిక్ రంగాల్లో విద్యార్థులకు ప్రయోజనాత్మక పరిజ్ఞానం అందించేందుకు ఐదు అత్యాధునిక ప్రయోగశాలలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

కెమెరాల ప్రదర్శన

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : జాతీయ కెమెరాడే సందర్భంగా వాల్తేరు ఫోటోగ్రఫీ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం బీచ్‌రోడ్ లోని పార్క్‌లో ఉదయం 6 గంటల నుండి ప్రజల సందర్శనార్థం పురాతన కెమెరాలు, అత్యాధునిక కెమెరాలు సుమారు 100 కెమెరాలు ప్రదర్శనలో పెట్టారు. 1940 సంవత్సరం నుండి 2025 వరకు ఉపయోగించిన కెమెరాలు ఈ ప్రదర్శనలో పెట్టడం జరిగింది. ఈ ప్రదర్శన తిలకించడానికి ఆసక్తి ఉన్న ప్రజలు వచ్చి చూసి గతస్మృతులు గుర్తు చేసుకునే విధంగా మంచి కార్యక్రమం చేపట్టారని వాల్తేరు ఫోటోగ్రఫీ సొసైటీ సభ్యులను కొనియాడారు. వాల్తేరు ఫోటోగ్రఫీ సొసైటీ అధ్యక్ష కార్యదర్శుల పి ఎన్ సేతు, ఎంవి.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్లబ్ సభ్యులు వేణుగోపాలరావు, రామరాజు, జగపతిరాజు, డివి.రమణ, సన్నీ, ఎస్ శ్రీనివాసరావు, రాము షీషోర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు జి.తిరుపతిరావు పాల్గొన్నారు.

కెమెరాలు పరిశీలిస్తున్న సందర్శకులు

'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ'ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలి

- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లికి బొత్స సూచన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైసిపి పోలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను దక్షిణ వైసిపి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ అంతర్గత విషయాలపై చర్చించారు. దక్షిణంలో ప్రజల్లోకి తీసుకు వెళ్తున్న బాబు ష్యూరిటీ,మోసం గ్యారంటీ కార్యక్రమం పట్ల వాసుపల్లిని అభినందించారు. మరింత క్షేత్రస్థాయికి తీసుకువెళ్లేందుకు ప్రజల్లో చైతన్యం నింపాలని పిలుపునిచ్చారు. వాసుపల్లి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వ్యతిరేక విధానాలు, అరాచక పాలన పట్ల ప్రజలను అప్రమత్తం చేయడం తమ బాధ్యత అన్నారు. చంద్రబాబు, నారా లోకేష్ ఏడాది పాలనపై ఇప్పటికే ప్రజలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని వెల్లడించారు.

జిల్లా కలెక్టర్ పేరిట ఫేస్‌బుక్‌లో ఫేక్ అకౌంట్

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : ఫేస్‌బుక్‌లో విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిరప్రసాద్ పేరుతో ఫేక్ అకౌంటును ఎవరో తెరిచారు. ఈ విషయాన్ని కలెక్టరేట్ నుంచి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఫోటోతో,ఆయన పేరుతో ఫేక్ అకౌంట్‌ను ఫేస్‌బుక్‌లో పేర్కొన్నారని,దానిని ఎవ్వరూ నమ్మవద్దని తెలిపారు. ఫేక్ అకౌంటు క్రియేట్ చేసిన వ్యక్తిపై ఫిర్యాదు చేస్తామన్నారు.

16,17న మాస్టర్ ప్లాన్‌పై సలహాలు, సూచనల స్వీకరణ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్ణయించిన విశాఖపట్నం మాస్టర్‌ప్లాన్ 2041కి సంబంధించి సలహాలు సూచనలు పరిగణనలోకి తీసుకునేందుకు ప్రజల నుంచి ఈ నెల 16, 17 తేదీల్లో విజ్ఞప్తులు స్వీకరిస్తామని విఎంఆర్డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్‌గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 ,17 తేదీల్లో మెట్రోపాలిటన్ కమిషనర్ కే.ఎస్ విశ్వనాథన్‌తో కలిసి ఉదయం 11 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు సిరిపురంలోని విఎమ్ఆర్డిఎ ప్రాంగణంలోనీ మూడో అంతస్తులో కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.